క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ ఒరిజినల్ తీసుకుని ఈ నెల 30వ తేదీన గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

వైభవంగా శ్రీదుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న శ్రీదుర్గాలమ్మ అమ్మవారు

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో కొలువైన శ్రీదుర్గాలమ్మ అమ్మ వారి ఆలయ 4వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తు న్న ఈ వేడుకలు మంగళవారం ముగిసాయి. వేకువ జాము నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు దంపతులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకమ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. గొర్లివానిపాలేనికి చెందిన అమ్మవారి భక్తుడు బాదిరెడ్డి లక్ష్మణ రూ.28 వేలు విలువ చేసే మకర తోరణం అమ్మవారికి బహూకరించారు.

ఘనంగా బ్యూటిఫికేషన్ డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం : ఇంటర్నేషనల్ బ్యూటిఫికేషన్ డే వేడుకలను మంగళవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని స్కిల్ హబ్‌లో బ్యూటిఫికేషన్ కోర్సు నేర్చుకుంటున్న వారి సమక్షంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.సౌజన్య, ట్రైనర్ భూపేష్‌కుమారి, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

మల్కాపురం : ధ్యానం ఒత్తిడిని తగ్గిస్తుందని, నిత్యం చేస్తే ప్రశాంతంగా ఉంటారని బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి సింధూ సిస్టర్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురంలోని బ్రహ్మకుమారి సంస్థ ధ్యాన మందిరంలో ధ్యానం, యోగాసనాలపై స్థానిక మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతటి పని ఒత్తిడిలో ఉన్నా రోజూ 30 నిమిషాలు ధ్యానం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆసనాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

కృష్ణావతారంలో జగన్నాథస్వామి



కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని ఇంద్రద్యుమ్న హాలు వద్ద వేంచేసియున్న జగన్నాథస్వామి మంగళవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గురు సంతోష్ జగన్నాథస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. మహిళలు ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం దానబోయినపాలేనికి చెందిన సీతారామాంజనేయ భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమునాయుడు, ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, పి.దేవరాజు, సన్యాసమ్మ, శ్రీనుబాబు, ఆలయ పూర్వీకులు గురు త్రినాథ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలు

- కుల, మత, రాజకీయాలకు అతీతంగా మంజూరు
- అర్హతే ప్రాతిపదికగా అమలు
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- 79వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలి యోగక్షేమాలను అడుగుతున్న ఎమ్మెల్యే



సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం తపించే సీఎంకు చల్లని దీవెనలు అందించి ఆశీర్వదించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా పేదలకు అందాలంటే వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థిక పరిపుష్టి సాధించడం సాధ్యమైందన్నారు. గ్రామంలో వృద్ధులను ఆత్మీయంగా పలకరించి, పింఛన్ అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలో కాలువలు, వీధి లైట్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ 79వ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, పూర్ణానం దశర్మ, చల్లా కనకారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, డి.వి.రమణ, పండూరి వెంకటరమణ, కర్రి వినోద్‌కుమార్, రెడ్డి శ్రీనివాసరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ



బంగారమ్మ తల్లి



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈవో త్రినాథరావు



అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ప్రియాగార్డెన్స్‌లో ఉన్న అమ్మవారి ఆలయానికి అడవివరం గ్రామస్తులు, భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గ్రామ సాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత అడవివరంలో ఉన్న శతకం పట్టు వద్ద నుంచి అమ్మవారి పూజారి వంశీయులైన లండ కుటుంబ సభ్యులు ఘటాలను శిరస్సుపై పెట్టుకుని ప్రియాగార్డెన్స్‌లో ఉన్న ఆలయానికి చేరుకున్నారు. దారి పొడవునా అమ్మవారికి గ్రామస్తులు హారతులు, పసుపు కుంకుమలు సమర్పించారు. సింహాచలం దేవస్థానం తరఫున ఈవో వి.త్రినాథరావు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయం వద్ద దేవస్థానం తరఫున భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీనివాసరావు, శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ లక్ష్మీప్రసన్న ఆలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అప్పలరాజు

సింహాచలం : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నేడు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో పోటీ పడుతున్నారని 98వ వార్డులోని సింహాచల్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా కానుక, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, ఆంగ్ల మాధ్యమంలో బోధన గురించి వివరించారు. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యురాలు సిరిపురపు ఆశాకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దివీస్ కంపెనీ అందించిన రూ. 15 వేలు విలువ చేసే 80 వాటర్ బాటిళ్లను విద్యార్థులకు అందజేశారు. సచివాలయ సెక్రటరీ శ్రీనాథ్, స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్. లక్ష్మణ్, ఉపాధ్యాయినిలు జాన్సీలక్ష్మీబాయి, రేఖ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో మహర్దశ

పల్లినారాయణపురం ఎంపీపీ స్కూల్లో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశం ఘనంగా జరిగింది. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రధానోపాధ్యాయుడు కె.దామోదర్ వివరించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని వివరించారు.



సమావేశంలోమాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు

కార్యక్రమంలో పాల్గొన్న 93వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను విద్యార్థుల కోసం అందిస్తున్నారని కొనియాడారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ దివ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రతిరోజూ బడికి పంపాలి

సబ్బవరం : విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించడం ద్వారా క్రమశిక్షణతో కూడిన విద్య ప్రాప్తిస్తుందని ఎంఈవో ఎస్. అప్పలరాజు తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని రాధాకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అప్పల రాజు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలతో పాటు జగనన్న విద్యాకానుగ అందజేసినట్లు తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా అందించిన సందేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మెన్ కర్రి జగ్గారావు, ఉపాధ్యాయులు పీవీ భాస్కర రావు, ఆర్ ప్రసాద్, సీహెచ్ కుమార్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను ప్రజలకు చేరువ చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కొటాన రాము

పరవాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు కృషి చేయాలని సబ్బవరం, పరవాడ మండలాల జగనన్న సురక్ష ఇన్‌చార్జి కొటాన రాము సూచించారు. గొర్లివానిపాలెం, రావాడ గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గృహసారథులు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ బి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటలకు మైదానం సిద్ధం



క్రీడా ప్రాంగణంలో శుభ్రం చేయిస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద క్రీడా మైదానాన్ని ఆటలకు అనుకూలంగా వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధం చేశారు. పార్టీ నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రత్నమాల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద డ్రైనేజీ పరిశీలన



పి.బోనంగిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణుడు

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో వివాదస్పదంగా మారిన డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణుడు అన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకొని నాలుగు నెలల క్రితం రూ.8లక్షలతో డ్రైనేజీ ఏర్పాటుకు పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. అయితే, గ్రామ మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు డ్రైనేజీ నిర్మాణ స్థలం తనదంటూ అడ్డుతగిలి పనులను నిలిపివేశారు. డ్రైనేజీ నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఇరువర్గాల మధ్య సమస్య జటిలంగా మారింది. దీంతో సమస్య పరిష్కరించాలని పంచాయతీ పాలకవర్గం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, ఆయన ఆదేశాల మేరకు ఆర్డీవో చిన్నికృష్ణుడు మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ఇరు వర్గాల మధ్య వివాదాస్పదంగా మారిన డ్రైనేజీని తహసీల్దారు కనకారావుతో కలిసి పరిశీలించారు. సమస్యను సర్పంచ్ బండారు కల్పన ఆర్డీవోకు వివరించారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. సమస్యను అధికారులతో చర్చించి త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట పరవాడ ఆర్ఐ శ్రీలేఖ, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు సత్యనారాయణ, నాగమణి, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం



రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ సుజాత ముత్యాలు, సచివాలయ సిబ్బంది

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో బదిలీ అయిన ఎడ్యుకేషన్ కార్యదర్శి డి.రామ్‌కుమార్ సేవలను గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు కొనియాడారు. గ్రామ సచివాలయంలో మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో రామ్‌కుమార్‌ను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, వైస్ ప్రెసిడెంట్ సూరాడ పెంటయ్య, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవీపురంలో ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



పూజలందుకుంటున్న వారాహి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ రోజు చివరిరోజు కావడంతో ముగింపు కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుండి వారాహి ఉత్సవమూర్తికి భక్తులు క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. ఆరోగ్య పరిరక్షణకు శ్రీయంత్ర మహామేరుకు, ఆగ్నేయ దిశలో ఉన్న వారాహి అమ్మవారికి భక్తులు స్వయంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారాహి సహస్ర నామావళి పారాయణ, వారాహి హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం తగదు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ
- 91, 92 వార్డుల్లో విస్తృత పర్యటన



మేహాద్రి గెడ్డ వద్ద పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91,92 వార్డుల్లో కమిషనర్ సాయికాంత్‌వర్మ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. జీవీఎంసీ 92వ వార్డు పరిధి వెంకటాపురం, కంపరపాలెం, మేహాద్రి గెడ్డ ప్రాంతాలను ఆయన జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కలిసి పరిశీలించారు. వెంకటాపురం రైల్వే బ్రిడ్జి దిగువ రహదారిని అభివృద్ధి చేయాలని బెహరా కోరారు. వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి, మేహాద్రి గెడ్డ మీదుగా నరవకు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. వెంకటాపురం, కంపరపాలెం ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. నిర్ణీత సమయానికి క్లాప్ వాహనాలతో ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని, ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. గోపాలపట్నం నుంచి సింహాచలం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి గిరిప్రదక్షిణకు అనువుగా తీర్చిదిద్దాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. ఇక్కడి ఇందిరానగర్‌లో చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. కంపరపాలెం పార్కును ఆధునికీకరించాలని, వెంకటాపురం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని, నరవ గెడ్డ ఆధునికీకరణ, తదితర పనులను కమిషనర్ దృష్టికి బెహరా భాస్కరరావు తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన దశల వారీగా పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు, పర్యవేక్షణ ఇంజినీర్ రామ్మోహనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషికుమారి, ఏఎంహెచ్‌వో రాజు, స్థానిక వైఎస్సార్ సీపీ 92వ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల మురళీకృష్ణ, గొంతిన నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ నిర్మాణం



శ్రీరామ్‌నగర్ వద్ద కాలువ నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్ నగర్ వద్ద పెద్ద కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ కాలువ శిథిలం కావడంతో వ్యర్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. దీంతో గ్రామస్తులు కార్పొరేటర్ గులిగిందల లావణ్య దృష్టికి ఈ సమస్యను ఇటీవల తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఆమె జీవీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులకు సమస్య వివరించి, కాలువ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు కార్పొరేటర్ కు అభినందనలు తెలిపారు.

విజినిగిరిపాలెంలో ఆరోగ్య సర్వే



సర్వే చేస్తున్న ఏఎంసీ, ఆరోగ్యకేంద్రం వైద్య బృందం



ఏఎంసీ, అడవివరం ఆరోగ్యకేంద్రం వైద్య బృందం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఆంధ్రా మెడికల్ కళాశాల, అడవివరం ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఏఎంసీ దత్తత గ్రామమైన విజినిగిరిపాలెంలోని ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సేవలపై సర్వే నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య విషయాలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏఎంసీ వైద్యులు డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ హారిక, ఎ.అచ్యుతరామయ్య, అడవివరం ఆరోగ్యకేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు నర్సమ్మ, సూర్యకుమారి పాల్గొన్నారు.

సచివాలయంలో మేయర్ ఆకస్మిక తనిఖీ



కార్యదర్శులతో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయాల ద్వారా పౌరసేవలు నిరంతరం అందాలని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదేశించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్సీ కాలనీ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యదర్శుల హాజరు మూవ్‌మెంట్ రిజిస్టర్, డైరీలతో పాటు కార్యదర్శులు వేసుకొనే డ్రెస్‌కోడ్‌ను పరిశీలించారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన సచివాలయంలో సరైన సేవలు అందేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు పెట్టుకున్న అర్జీలను నిర్ణీత సమయానికే పరిష్కరించేలా చర్యలు తీసుకుని, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

శరత్‌బాబుకు ఘన నివాళి



శరత్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళా సేవా పీఠం కార్యాలయంలో ప్రముఖ సినీనటుడు శరత్ బాబు చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళా సేవా పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు మాట్లాడుతూ నటనలో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి శరత్ బాబు అని కొనియాడారు. కళా సేవా పీఠం అధ్యక్షుడు కొరకల రామదాసు మాట్లాడుతూ శరత్ బాబు కళా రంగానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఉత్తరాంధ్ర నటుడు ఈ స్థాయికి చేరుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో చందు సుబ్బారావు, గంపల అప్పారావు, సింహాచలం నాయుడు, గంపల అప్పారావు, భాస్కర్ పాణిగ్రాహి, ఆళ్ల నారాయణ రావు పాల్గొన్నారు.